: www.aknu.edu.in
: nannayavani@aknu.edu.in
: nannayanewstv
: Adikavi Nannaya University
: 9701293231



విశ్వవిద్యాలయ స్థాయి తొలి తెలుగు వార పత్రిక

# నన్నయ వాణి


ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్


గౌరవ సంపాదకులు
ఆచార్య మొక్కా జగన్నాథరావు
ఉపకులపతి

ప్రధాన సంపాదకులు
ఆచార్య తుపాకుల అశోక్
కుల సచివులు

సంపాదకులు
డా. తలారి వాసు, సహాయాచార్య, తెలుగు శాఖ
పువ్వల ఆనంద్, ప్రజా సంబంధాల అధికారి, కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 2 | సంచిక : 14 | 10-01-2022 | పుటలు : 4



జనవరి 12
స్వామి వివేకానంద జయంతి
జాతీయ యువజనోత్సవం మరియు
సంక్రాంతి పర్వదిన
శుభాకాంక్షలతో....
- నన్నయవాణి

# సమష్టిగా నన్నయ అభివృద్ధికి కృషి చేద్దాం



రెండేళ్ళ నన్నయ ప్రగతి కార్యశాలలో మాట్లాడుతున్న వీసీ

**07.01.22 (మీడియాసెల్)** అందరి సహకారంతో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం గత రెండు సంవత్సరాలలో ఎంతో పురోగతిని సాధించిందని, 2022 సంవత్సరంలో మరింత అభివృద్ధి సాధించేందుకు సమష్టిగా కృషి చేద్దామని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. యూనివర్సిటీ కన్వెన్షన్ సెంటర్ లో శుక్రవారం "రెండు సంవత్సరాల పురోగతి మరియు విజయాల సమీక్ష : 2022 వ్యూహాలు మరియు లక్ష్యాలు" అనే అంశంపై కార్యశాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు హాజరై జ్యోతిప్రజ్వలన చేసి కార్యశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు మాట్లాడుతూ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయానికి ఉపకులపతిగా తనను నియమించిన రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహనరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. తాను బాధ్యతలు స్వీకరించిన రెండేళ్ళ కాలంలో సాధించిన అభివృద్ధితో పాటు ఈ ఏడాది విశ్వవిద్యాలయాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు సమష్టిగా కృషి చేద్దామని అన్నారు. స్నాతకోత్సవానికి గవర్నర్ హాజరు కావడం, దిశ యాప్ ఆవిష్కరణకు సిఎం హాజరు కావడం వంటి గొప్ప కార్యక్రమాలు తాను బాధ్యతలు స్వీకరించిన తొలిరోజుల్లో జరిగి విశ్వవిద్యాలయ అభివృద్ధికి పునాదులు పడ్డాయన్నారు. అదే స్ఫూర్తితో యూనివర్సిటీకి ఎంతో అవసరమైన ఐ.ఎస్.ఓ., ఎ.ఐ.సి.టి.ఇ. గుర్తింపులను తీసుకువచ్చామని అన్నారు. కోవిడ్ వంటి సంక్షోభ పరిస్థితులు వచ్చి ప్రపంచమంతా లాక్ డౌన్ లో ఉన్న నేపథ్యాన్ని కూడా అవకాశాలుగా మల్చుకొని వెబినార్స్ వంటి నూతన విజ్ఞాన మార్గాలను నన్నయ విశ్వవిద్యాలయం ప్రారంభించిందని అన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఆన్లైన్ కార్యక్రమాలు నిర్వహించి విద్య,విజ్ఞానాలు వికసింపచేసామని చెప్పారు. నాలుగు వందల రోజుల్లో వందకు పైగా వెబినార్లు నిర్వహించి ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్, ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ సాధించామని తెలిపారు. నన్నయ విశ్వవిద్యాలయానికి తొలిసారిగా కేంద్ర నిధులను తీసుకువచ్చేందుకు ప్రయత్నించామని,ఎనిమిది కోట్లకు పైగా ఖేలో నిధులు క్రీడాభివృద్ధికి కేటాయించడం జరిగిందన్నారు. విశ్వవిద్యాలయాల చరిత్రలో విశ్వవిద్యాలయ స్థాయి తొలి తెలుగు వారపత్రికగా ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం నుండి "నన్నయవాణి" పేరుతో ప్రతీ సోమవారం విశ్వవిద్యాలయ పత్రిక విడుదల అవుతుందన్నారు. వినిమయ, వినూత్న, విజ్ఞాన భారతి వంటి కార్యక్రమాలు విద్యా, పరిశోధన ప్రగతికి నిదర్శనాలుగా ఉన్నాయ న్నారు. కోవిడ్ భయందోళనలో ఉన్న ప్రజలను ఆదుకొనేందుకు సామాజిక బాధ్యతగా సైకలాజికల్ ఆన్లైన్ కౌన్సిలింగ్ సేవలను ప్రారంభించామని చెప్పారు. కోవిడ్ తర్వాత యూనివర్సిటీ హెల్త్ సెంటర్ లో కౌన్సిలింగ్ సెంటర్ ను ఏర్పాటు చేసామని తెలిపారు. విద్యార్థులకు, పరిశోధకులకు, అధ్యాపకులకు అంతర్జాతీయ జర్నల్స్ ను అందించేందుకు జెస్టోర్, జెగేట్ సేవలను కొనుగోలు చేసామన్నారు. నన్నయ ప్రాంగణాన్ని పచ్చని ప్రకృతి ఒడిగా తీర్చిదిద్దామని తెలిపారు. అన్ని విభాగాలను పటిష్టపరచి విద్య, విజ్ఞాన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. స్టూడెంట్స్ క్లబ్స్ ద్వారా విద్యార్థులను వినూత్న విజ్ఞానాన్ని వెలికితీస్తున్నామని తెలిపారు. 2022 సంవత్సరంలో విశ్వవిద్యాలయానికి నాక్ గుర్తింపును తీసుకువస్తామని అన్నారు. యూనివర్సిటీ హెచ్.ఆర్.డి సెంటర్ ను ప్రారంభించి మరిన్ని సేవలు అందిస్తామని చెప్పారు. ఆయా జాతీయ, అంతర్జాతీయ సంస్థలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకొని విశ్వవిద్యాలయ ప్రగతికి పాటుపడతానన్నారు. ఉభయగోదావరి జిల్లాల్లోని ఉన్నత విద్యాసక్తి గల వారి కోసం నాక్ గుర్తింపు సాధించిన తర్వాత దూరవిద్య కోర్సులను ప్రారంభిస్తామని తెలిపారు. విశ్వవిద్యాలయ అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది తక్కువ

## రెండేళ్ల నన్నయ ప్రగతిపై వీసీకి ప్రశంసలు

వేతనాలతో పని చేస్తున్నారని వారి ఉన్నతిని ఆకాంక్షిస్తున్నానని చెప్పారు. 2022వ సంవత్సరం విశ్వవిద్యాలయాన్ని మరింతగా అభివృద్ధి పథంలో నడిపించేందుకు సమష్టిగా కృషి చేయాలని కోరారు. ఈ రెండేళ్ళ కాలంలో విశ్వవిద్యాలయ అభివృద్ధికి సహకరించిన సిఎం శ్రీ జగన్మోహనరెడ్డికి, విద్యాశాఖమంత్రి డా.ఆదిమూలపు సురేష్ కు, విద్యాశాఖ ఉన్నతాధికారులకు, విశ్వవిద్యాలయ అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేసారు. కార్యశాలకు అధ్యక్షత వహించిన రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ మాట్లాడుతూ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయానికి ఉపకులపతిగా వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు బాధ్యతలను స్వీకరించిన ఈ రెండు సంవత్సరాల కాలంలో విశ్వ విద్యాలయం ఎంతో అభివృద్ధి సాధించిందని అన్నారు. కోవిడ్ వంటి సంక్షోభ పరిస్థితులను కూడా వీసీ అవకాశాలుగా మరల్చి విద్య, విజ్ఞాన వికాసానికి మార్గనిర్దేశాలు చేసారని కొనియాడారు. ప్రిన్సిపాల్స్ ఆచార్య ఎస్.టేకి, డా.కె.రమణేశ్వరి, డా.వి.పెర్సిస్, డా.ఎం.కమలకుమారి లు ఈ రెండేళ్ళ కాలంలో తమతమ కళాశాలల్లో సాధించిన అభివృద్ధి కార్యక్రమాలను తెలియజేసారు. డీన్స్ ఆచార్య పి.సురేష్ వర్మ, డా.ఎ.మట్టారెడ్డి, డా.పి.వెంకటేశ్వర రావు యూనివర్సిటీ అభివృద్ధిని, ప్రగతి నివేదికలను తెలియజేసారు. అనుబంధ కళాశాలల అసోసియేషన్ తరుపున డా.సుగుణరెడ్డి, హబిబ్ బాషాలు ఈ రెండేళ్ళ కాలంలో విశ్వవిద్యాలయ అభివృద్ధికి కృషి చేసిన వీసీని అభినందించారు. విశ్వవిద్యాలయాల అభివృద్ధికి అనుబంధ కళాశాలల భాగస్వామ్యం ఎప్పుడూ ఉంటుందని తెలియజేసారు. అనంతరం ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ రాజమహేంద్రవరం, కాకినాడ, తాడేపల్లిగూడెం క్యాంపస్ విభాగాల అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది, అనుబంధ కళాశాల ప్రతినిధులు మరియు అనూరా అలుమ్ని అసోసియేషన్ సభ్యులు, విద్యార్థులు వీసీ ని శాలువాలు, పూలమాలలతో సన్మానించి జ్ఞాపికలను అందజేసి అభినందించారు.



వీసీ జగన్నాథరావును సన్మానిస్తున్న సిబ్బంది

## ఘనంగా నన్నయ సంక్రాంతి సంబరాలు



భోగిమంటను వెలిగించి సంబరాలను ప్రారంభించిన వీసీ

**07.01.22 (మీడియాసెల్)** ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో శుక్రవారం విద్యార్థుల ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వీసీ ఆచార్య ఎం.జగన్నాథరావు హాజరై భోగిమంటను వెలిగించి సంక్రాంతి సంబరాలను ప్రారంభించారు. విద్యార్థులు గొబ్బెమ్మలను ఏర్పాటు చేసి నృత్య ప్రదర్శనలు చేసారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ కుల, మత, ప్రాంతాలకు అతీతంగా విశ్వవిద్యాలయంలో జరిగే వేడుకల్లో అందరూ పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. విశ్వవిద్యాలయాల్లో ఇటువంటి మంచి వాతావరణం ఉండటం సమాజానికి మార్గదర్శకమన్నారు. భవిష్యత్తులో విద్యార్థులంతా ఉన్నత విద్యావంతులుగా, ఉద్యోగస్థులుగా స్థిరపడాలని ఆకాంక్షించారు. మధ్యాహ్నం కన్వెన్షన్ సెంటర్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థులు సంప్రదాయ వస్త్ర ప్రదర్శనలు, నృత్య ప్రదర్శనలు, తెలుగు సంభాషణలు వంటి కార్యక్రమాలు నిర్వహించారు. గురువారం నిర్వహించిన రంగోళి పోటీలలో విజేతలకు బహుమతులను అందజేసారు.

## డిగ్రీ, పీజీ స్పెషల్ డ్రైవ్ ఎగ్జామ్స్

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ, పీజీ స్పెషల్ డ్రైవ్ ఎగ్జామ్స్ నిర్వహిస్తున్నారు. డిగ్రీ వివిధ కోర్సులకు సంబంధించిన బ్యాక్‌లాగ్ సబ్జెక్టులు (కామన్ కోర్ స్కీమ్, క్లాసిక్ స్కీమ్ మరియు CBCS స్కీమ్) 2012-13 నుండి 2016-17కి అనుమతించబడిన బ్యాచ్ ప్రత్యేక డ్రైవ్ పరీక్షలు నిర్వహించనున్నారు. అలాగే పీజీ 2006-07 నుండి 2017-18 వరకు కోర్సుల వారికి స్పెషల్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించనున్నారు. స్పెషల్ డ్రైవ్ ఎగ్జామ్ ఫీజు 28.02.2022 తేదీ లోపు చెల్లించాలి. పరీక్షల ఫీజు, పరీక్షా విధానం, దరఖాస్తు వంటి వివరాల కొరకు www.aknu.edu.in యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సంప్రదించండి.

## సంపాదకీయం



## స్వామి వివేకానంద

*బ్రతుకుతెరువు చూపేది ఒకటి. బ్రతుకుకి గమ్యమైనది ఒకటి. జీవన మార్గదర్శనం – వివేకంవల్ల సాధ్యం. జీవిత ధ్యేయం – ఆనందం! ఈ రెండూ ఉన్న నరుడు – ఇతరులకి వాటిని పంచగలిగితే – ఆ వ్యక్తి నరేంద్రుడు, వివేకానందుడు కాగలడు. ఇదొక పరిణామ ప్రక్రియ. ఆ రసాయనిక ప్రక్రియకి గురువు శక్తిపాతం గొప్ప ప్రేరణ! రామకృష్ణ పరమహంస అటువంటి శక్తిని ఇవ్వగల గురువు. హంస – పాలని నీటిని వేరుపర్చగలదట. రామకృష్ణులు నరునిలో దాగిఉన్న వివేకానందుని విశేషించి చూపగలిగిన మహనీయుడు. దేవుని చూశానని చెప్పటమే కాకుండా చూపదలచి శక్తిపాతం వలన నరేంద్రుని వివేకానంద స్వరూపాల ఆత్మసాక్షాత్కారం చేయించిన జితేంద్రియుడాయన.*

*భౌతికాంశాలకి ప్రాధాన్యం కలిగిన దేశంలో చికాగో నగరంలో సర్వమత సమ్మేళనం సభలో – అందరికీ విశ్వమానవ సౌభ్రాత్ర దర్శనభాగ్యం కలిగింది. భారతీయ తత్త్వశాస్త్ర వికాసం ఎటువంటిదో ప్రపంచమంతా విహారం చేసింది. భారతదేశ స్వాతంత్ర్య సమరంలో బ్రహ్మాస్త్రమై పరిఢవిల్లింది.దేశ దేశాలకీ భారతదేశం ఉత్తమ దేశంగా నిలచింది. యువశక్తికి వివేకానంద పరిపూర్ణ ప్రతీక.*

*ఆయన స్వరూపం – ప్రరోచన! ఆయన బోధన – ప్రచోదన!*

*ఆయన ఉవాచ – ఉద్దీపన! వివేకానంద స్వామి – భారతీయ సాంస్కృతిక మహెూదధి!!*

*భారతదేశం.....*

*బాల్యంలో నా ఊయల! కౌమారంలో నా ఉద్యానవనం! యవ్వనంలో నా స్వర్గలోకం! వార్ధక్యంలో నా వారణాసి!!*

*ఎంత గొప్ప భావన! ఈ నాలుగు మాటలు చతుర్వేదాలు!! దేశం దేశం – ఈ చైతన్యోత్సవ ఆహ్వానాన్ని అందుకొంది. భారతదేశం "sacred Mother Lands! " Here activity prevailed when Greece didnot exist; when Rome wasnd't thought of; when the very fathers of modern Europeans lived in forests and painted themselves blue!.....We are the children of such a country! అని గర్జించిన వేదాంత కేసరి యువతరాన్ని... ఉక్కు కండరాలు,ఇనుప నరాలు కలిగి, 'నెత్తురు మండే, శక్తులు నిండే'యోధులుగా మార్చింది. ఈ అవతారమూర్తి, ఈ కారణజన్ముడు జాతిని జాగృతం చేసిన నేత! అని గుర్తించింది. "సంభవామి యుగే యుగే!" అని మురిసిపోయింది. ఈ జాతికి "బలమే జీవం. బలహీనత మరణం!" మంత్రపాఠమైంది.*

*హిమాలయ పర్వతం.. ఇంక్ స్టాండ్‌గా, హిందూ మహాసముద్రం ఇంకు గా, భారత భూభాగం తెల్లకాగితం గా, కాలమే మహారచయితగా కూర్చుని వ్రాసినా... వివేకానంద స్వామీజీ రుణం ఈ జాతి తీర్చుకోలేదు. జాతి జనులు మరి ఇంకేం చేయాలి? "Awake! Arise! Stop not till the goal is reached!" "ఉత్తిష్ఠ! జాగ్రత! ప్రాప్యవరాన్ని బోధత!" అనే వివేకానంద స్వామి నినాదమే జనుల జీవనాదం కావాలి! జాతి జీవనవేదం కావాలి!!*

### మంచి మాట

శక్తి అంతా మీలోనే ఉంది. మీరు ఏమైనా చేయగలరు. అన్నీ చేయగలరు. దీనిని నమ్మండి. మీరు బలహీనులమని భావించకండి. ధీరులై లేచి నిలబడి మీలోని దివ్యత్వాన్ని ప్రకటించండి. మీ సొంత శక్తి మీదనే ఆధారపడండి. బలమే జీవనం. బలహీనతే మరణం.

- స్వామి వివేకానంద



# భారత పరిశ్రమల ఆర్థిక పురోగతికి పాటుపడదాం




**05.01.22 (మీడియాసెల్)** కోవిడ్ 19 కారణంగా ప్రపంచంలోని అన్ని దేశాలు పరిశ్రామికంగా, ఆర్థికంగా సంక్షోభంలోనికి దిగిపోయాయని వాటిని అధిగమిస్తూ భారతదేశం పరిశ్రమలు ఆర్థిక పురోగతిని సాధించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ డిపార్ట్మెంట్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్మెంట్ స్టడీస్ ఆధ్వర్యంలో బుధవారం యూనివర్సిటీ సెమినార్ హాల్ లో "కోవిడ్-19 తర్వాత భారతీయ పరిశ్రమ మరియు ఆర్థిక వ్యవస్థ : పునరుద్దరించడానికి నిర్వహణ వ్యూహాలు" అనే అంశంపై జాతీయ సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు హాజరై జ్యోతిప్రజ్వలన చేసి రెండు రోజుల నేషనల్ సెమినార్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ కోవిడ్ %--% 19 కారణంగా అన్ని రంగాలు తీవ్రఇబ్బందులను ఎదుర్కొంటున్నాయని వాటిని అధిగమించే విధంగా నిపుణులు, మేధావులు,ఆర్థికవేత్తలు ప్రణాళికలు సిద్ధం చేయాలని చెప్పారు.ముఖ్యంగా భారతీయ ఆర్థిక వ్యవస్థ, పారిశ్రామిక వ్యవస్థపై కోవిడ్ ప్రభావం అధికంగా ఉందని తెలిపారు.యువత ఎక్కువ శాతం ఉన్న భారతదేశంలో కోవిడ్ పరిస్థితులను అధిగమించడానికి ఎక్కువ మార్గాలు,అవకాశాలు ఉంటాయన్నారు. మనిషి చేసే ప్రతి పనిలో మెనేజ్మెంట్ ఉంటుందని, మెనేజ్మెంట్ స్కిల్స్ ను పెంచుకుని ఉపయోగించేవారు అభివృద్ధిని సాధిస్తారన్నారు. కోవిడ్ 19 వంటి విపత్కర పరిస్థితుల్లో కూడా విశ్వవిద్యాలయం ఎంతో అభివృద్ధి సాధించిందని గుర్తుచేసారు. అతి తక్కువ కాలంలో వందకు పైగా వెబినార్లు నిర్వహించి ఆసియా, ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ సాధించామని పేర్కొన్నారు. కోవిడ్ తర్వాత భారతీయ ఆర్థిక, పరిశ్రమ వ్యవస్థల పురోగతి వ్యూహాలపై చర్చించేందుకు చక్కని సెమినార్ యూనివర్సిటీలో జరగడం హర్షనీయమన్నారు. ఈ రెండు రోజుల సెమినార్ లో దేశాభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలు చర్చించాలని తెలియజేసారు. ఆంధ్రపేపర్ మిల్ డిప్యూటి జనరల్ మేనేజర్ అవినాశ్ కుమార్, జనరల్ మేనేజర్ ప్రమోద్ కుమార్ లు మాట్లాడుతూ కోవిడ్ తర్వాత పారిశ్రామిక పురోగతికి సాంకేతిక నైపుణ్యాలను అందిపుచ్చుకోవడం వంటి విషయాలను విశ్లేషణాత్మకంగా వివరించారు. కీలకోపన్యాసకులుగా రిలయన్స్ జియో వైస్ ప్రెసిడెంట్ జోషి ఆన్లైన్ ద్వారా మాట్లాడుతూ కోవిడ్ అనంతరం భారతదేశ ఆర్థిక, పారిశ్రామిక పరిస్థితులను తెలియజేసారు. అలాగే దేశ ఆర్థిక, పారిశ్రామిక వ్యవస్థల పురోగతికి అవసరమైన ప్రణాళికను వివరించారు. నేషనల్ సెమినార్ డైరెక్టర్ ఆచార్య ఎస్.టేకి మాట్లాడుతూ కోవిడ్ తర్వాత భారతీయ ఆర్థిక, పరిశ్రమల వ్యవస్థల పురోగతి వ్యూహాలపై సమగ్రమైన చర్చ జరుగుతుందని తెలిపారు.దేశం నలుమూలల నుండి 69 పరిశోధన పత్రాలు వచ్చాయని అన్నారు. పరిశోధన పత్రాలకు సంబంధించిన సీడీ లను వీసీ ఆవిష్కరించారు. అనంతరం సెమినార్ నిర్వాహకులు అతిథులను సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, సెమినార్ డైరెక్టర్ ఆచార్య ఎస్.టేకి, కన్వీనర్స్ డా.పి.ఉమామహేశ్వరి, డా.ఎన్.ఉదయ్ భాస్కర్, విభాగాధ్యాపకులు, డా.రాజేంద్రప్రసాద్, డా.వల్లి, డా.ఎలైస్ జాయ్, డా.రవిశంకర్, డా.ఎమ్.రమేష్, డా.ఎమ్.అమ్మిరెడ్డి, డా.జోహార్ కృష్ణ, డా.ఐ.ఎస్.ఎన్.రాజు, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.




# వెయిట్ లిఫ్టింగ్‌లో సత్తాచాటిన "నన్నయ"

## ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీలో స్వర్ణ, రజతం పతకాలు కైవసం


క్రీడాకారులను సన్మానించి అభినందించిన వీసీ

**05.01.22 (మీడియాసెల్)** ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ వెయిట్ లిఫ్టింగ్ ఉమెన్ చాంపియన్షిప్ 2021-22 లో ఆదికవి నన్నయ యూనివర్సిటీ క్రీడాకారులు తమ ప్రతిభను కనపరచి స్వర్ణ, రజత పతకాలను కైవసం చేసుకున్నారు. యూనివర్సిటీలోని బుధవారం వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు క్రీడాకారులను శాలువాతో సన్మానించి జ్ఞాపికను అందించి అభినందించారు. ఈ సందర్భంగా వీసీ వివరాలను తెలియజేసారు. ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ వెయిట్ లిఫ్టింగ్ ఉమెన్ ఛాంపియన్షిప్ ఆదికవి నన్నయ యూనివర్సిటీ క్రీడాకారులు సత్తాచాటారని అన్నారు. 27.12.21 నుండి 30.12.21 వరకు ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ వెయిట్ లిఫ్టింగ్ ఉమెన్ చాంపియన్షిప్ 2021-22 పోటీలను నిర్వహించారని తెలిపారు. ఈ పోటీలలో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాల ఏలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన మొగిలి దీపా నయోమి 59 కేజీల కేటగిరీలో మొదటి స్థానంలో నిలిచి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకున్నారన్నారు. అలాగే వి.ఎస్.లక్ష్మీ ఉమెన్స్ డిగ్రీ కాలేజ్ కాకినాడకు చెందిన పాలాటి ధాత్రి 76 కేజీల కేటగిరీలో రెండో స్థానంలో నిలిచి రజత పతకాన్ని సాధించారన్నారు. ఉభయగోదావరి జిల్లాల్లోని యువతలో క్రీడా స్ఫూర్తిని నింపేందుకు వీర వనితలుగా వీరిద్దరు నిలిచారని చెప్పారు. జైన్ యూనివర్సిటీ బెంగుళూరులోని ఖేలో ఇండియా ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్ కు ఆదికవి నన్నయ యూనివర్సిటీ తరుపున వీరిద్దరూ ఎంపికయ్యారని శుభాకాంక్షలను తెలియజేసారు. యూనివర్సిటీ తరపున పతకాలను సాధించిన క్రీడాకారులకు నగదు బహుమతితో పాటు 10 శాతం గ్రేస్ మార్కులను ఇస్తామన్నారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ క్రీడలకు ఎంతో ప్రాధాన్యం ఇస్తుందన్నారు. ఉభయగోదావరి జిల్లాల క్రీడాకారులు తమ ప్రతిభను కనపరచేందుకు యూనివర్సిటీ చక్కని వేదిక అని తెలిపారు. యువత క్రీడలపై దృష్టి సారించి యూనివర్సిటీ కీర్తి ప్రతిష్టలను మరింత పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, స్పోర్ట్స్ బోర్డ్ కోఆర్డినేటర్ డా.కె.సుబ్బారావు, సెక్రటరీ డా.బి.రామ్ గోపాల్, ఉమెన్స్ సెల్ కోఆర్డినేటర్ డా.కె.నూకరత్నం, టీమ్ మేనేజర్ డా.రమణ, శాప్ కోచ్ సతీష్, క్రీడాకారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# అందరికీ నవరత్నాలు



సమావేశంలో మాట్లాడుతున్న వైస్ చైర్మన్ నారాయణమూర్తి

**04.01.22 (మీడియాసెల్)** ప్రపంచంలోని ఏ దేశంలో లేని విధంగా భారతదేశంలో ఆంధ్రప్రదేశ్ లో నవరత్నాల ద్వారా సంక్షేమ పథకాలు ప్రజలందరికీ అందుతున్నాయని నవరత్నాలు ఎక్జిక్యూటీవ్ వైస్ చైర్మన్ ఎ.ఎన్. నారాయణమూర్తి అన్నారు. యూనివర్సిటీ ఈసీ హాల్ లో మంగళవారం "ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ కార్యక్రమాల సానుకూల ప్రభావం - నవరత్నాల లబ్ధిదారుల సంక్షేమం మరియు సామాజిక ఆర్థిక అభివృద్ధి" అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నవరత్నాలు ఎక్జిక్యూటీవ్ వైస్ చైర్మన్ ఎ.ఎన్. నారాయణమూర్తి, వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు మరియు విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు,మేధావులు, విద్యార్థులు, రైతులు, ఎన్జీఓలు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్స్ హాజరయ్యారు. నవరత్నాల అమలు, నిర్వహణ, క్షేత్రస్థాయి పరిస్థితులపై రౌండ్ టేబుల్ సమావేశంలో పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా అందరూ చర్చించారు. నేటి వరకూ ఏ ప్రభుత్వంలోను లేని విధంగా నవరత్నాల ద్వారా ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు అవుతున్నాయని, ఎంతో ప్రజాదరణ పొందిందని సభ్యులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేసారు. ఈ సందర్భంగా నవరత్నాలు ఎక్జిక్యూటీవ్ వైస్ చైర్మన్ ఎ.ఎన్. నారాయణమూర్తి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహనరెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాలు ఎంతో ప్రజాదరణ పొందాయని ప్రతీ కుటుంబంలో నవరత్నాల సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారులు ఉన్నారని చెప్పారు. నవరత్నాలు సామాజిక అభివృద్ధికి దోహదపడుతున్నాయని పేదరికం, నిరక్ష్యరాస్యత వంటి వాటిని అధిగమించే సాధనంగా ఉందన్నారు.కోవిడ్ వంటి సంక్షోభ సమయంలో కూడా ఏ రాష్ట్రంలోను లేని విధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలు జరిగాయని తెలిపారు.దేశమే ఆశ్చర్యపోయే విధంగా సిఎం జగన్మోహనరెడ్డి వాలంటీర్ వ్యవస్థను ఏర్పాటుచేసి గ్రామీణ పరిపాలన వ్యవస్థను బలోపేతం చేసారని చెప్పారు.ఆరోగ్య శ్రీ ద్వారా లక్షలాదిమంది లబ్ధిపొందారని ఇతర రాష్ట్రాలు వాటిని అవలంబిస్తున్నాయని, 104,108 సేవలను విస్తరింప చేసారని కొనియాడారు. వై.ఎస్.ఆర్.రైతుభరోసా,ఫించన్ల కానుక, జలయజ్ఞం, మద్య నియంత్రణ, పేదలకు ఇళ్ళు, వై.ఎస్.ఆర్ ఆసరా, వై.ఎస్.ఆర్. చేయూత వంటి పథకాలు అన్ని వర్గాల వారికి చేరుతున్నాయన్నారు. రాష్ట్రంలోని విద్యా వ్యవస్థ అభివృద్ధిపై సిఎం జగన్ ప్రత్యేక దృష్టి సారించారని అమ్మఒడి పథకం ద్వారా అర్హులైన ప్రతీ తల్లి అకౌంట్ లో డబ్బులు జమ అవుతున్నాయని, పేదలందరూ చదువుకొనే సామర్థ్యాన్ని,సహాయాన్ని ప్రభుత్వం అందిస్తుందని చెప్పారు. ఫీజు రియింబర్స్మెంట్ ద్వారా పేద విద్యార్థులకు ఉన్నత విద్యను అందిస్తున్నామన్నారు. నాడు - నేడు కార్యక్రమం ద్వారా రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసామని, జగనన్న విద్యాదీవెన,వసతి దీవెన పథకాలు క్రింద అందరూ లబ్ధిపొందుతున్నారని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అన్ని విధాల అభివృద్ధి చేయడానికి ప్రజలందరి ఆర్థిక, సామాజిక స్థితిగతులను మెరుగుపరచడానికి సిఎం జగన్ కృషి చేస్తున్నారని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే అతిపెద్ద విశ్వవిద్యాలయమైన ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో నవరత్నాలపై చక్కని రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటుకు సహకరించిన వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావుకు కృతజ్ఞతలు తెలిపారు. విశ్వవిద్యాలయాలలో సామాజిక బాధ్యతగా ఇటువంటి విషయాలను చర్చించాలని అభివృద్ధి ఫలాలు అందరికీ తీసుకువెల్లాల్సిన బాధ్యత మనందరిపై ఉందని చెప్పారు. నరత్నాలు సంక్షేమ పథకాలపై మేధావులు, విద్యావేత్తల సూచనలు, సలహాలు అందించాలని కోరారు. వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు మాట్లాడుతూ ప్రజలందరికీ ఉపయోగపడే విధంగా ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో తొలిసారిగా చక్కని కార్యక్రమాన్ని నిర్వహించడం హర్షణీయమని అన్నారు. అన్ని వర్గాల ప్రజలు దీనిలో హాజరై వారి అమూల్యమైన సూచనలను, సలహాలను అందించారని ఈ నివేదికను ప్రభుత్వానికి పంపించడం జరుగుతుందన్నారు. విశ్వవిద్యాలయం సామాజిక బాధ్యతగా కమ్యూనిటీ సర్వీస్ పేరుతో క్షేత్రస్థాయి కార్యక్రమాలను నిర్వహిస్తామని దానిలో నవరత్నాల అమలుపై క్షేత్రస్థాయి నివేదికలు వస్తాయని తెలిపారు. తరువాత విశ్వవిద్యాలయం తరుపున నవరత్నాలు ఎగ్జిక్యూటీవ్ వైస్ చైర్మన్ ఎ.ఎన్. నారాయణమూర్తిని సన్మానించి జ్ఞాపికను అందజేసారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, రౌండ్ టేబుల్ మీటింగ్ కోఆర్డినేటర్ ఆచార్య ఎస్.టేకి, రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ప్రిన్సిపాల్స్ డా.వి.పెర్సిస్, డా.కె.రమణేశ్వరి, డా.కె.సుబ్బారావు, డీన్స్, ట్రైనింగ్ సెంటర్ కోఆర్డినేటర్ శ్రీనివాస్, ఎన్జీఓ టి.జయశ్రీ, అధికారులు, అధ్యాపకులు, మేధావులు, విద్యార్థులు, రైతులు, ఎన్జీఓలు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్స్,రైతులు తదితరులు పాల్గొన్నారు.




# ఆన్లైన్ ఫీ పేమెంట్ పోర్టల్ ప్రారంభం



ఆన్‌లైన్ ఫీ పేమెంట్ పోర్టల్ పోస్టర్ ను ఆవిష్కరిస్తున్న వీసీ

**06.01.22 (మీడియాసెల్)** ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఆన్లైన్ ఫీ పేమెంట్ పోర్టల్ ను వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు గురువారం ప్రారంభించారు. యాక్సిస్ బ్యాంక్ వారి సహకారంతో యూనివర్సిటీ ఆన్లైన్ ఫీ పేమెంట్స్ నిర్వహించనున్నారు. దీనికి సంబంధించి యూనివర్సిటీ ఈసీ హాల్ లో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. యూనివర్సిటీ వీసీ, రిజిస్ట్రార్, ఎగ్జామ్స్, సీడీసీ, అకౌంట్స్ విభాగాలకు సంబంధించిన అధికారులు మరియు యాక్సిస్ బ్యాంక్ అధికారులు ఈ కార్యక్రమానికి హాజరై యూనివర్సిటీ ఆన్లైన్ ఫీ పేమెంట్ పోర్టల్ బ్రోచర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు మాట్లాడుతూ ఉభయగోదావరి జిల్లాలలో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం సుమారు 420 అనుబంధ కళాశాలలతో, లక్షకు పైగా విద్యార్థులతో ఎంతో ఎక్కువ పరిధిని కలిగి ఉందన్నారు. ఈ నేపథ్యంలో యూనివర్సిటీ ఎగ్జామ్స్ విభాగానికి విద్యార్థుల ఫీజు చెల్లింపులు, యూనివర్సిటీ కాలేజ్ డెవలప్మెంట్ కౌన్సిల్ కు సంబంధించిన ఫీజు చెల్లింపులు మరియు ఇతర ఫీజుల చెల్లిపులు ఇకపై ఆన్లైన్ ద్వారా చెల్లించేందుకు అవకాశం కల్పిస్తున్నామన్నారు. యాక్సిస్ బ్యాంక్ వారి సహకారంతో ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఫీ పేమెంట్స్ ను ఆన్లైన్ ద్వారా చెల్లించవచ్చునని ఆ వివరాలు యూనివర్సిటీ వెబ్ సైట్ ద్వారా తెలుసుకోవచ్చునని పేర్కొన్నారు. అందరికీ అందుబాటులో యూనివర్సిటీ సేవలు ఉండాలనే ఉద్దేశంతో ఆన్లైన్ పేమెంట్స్ ను నిర్వహిస్తున్నామని దీని ద్వారా పని సులభతరం అవుతుందని చెప్పారు. కొవిడ్ నేపథ్యంలో ఆన్లైన్ ఫీ పేమెంట్ పోర్టల్ విద్యార్థులకు, కళాశాలల యాజమాన్యాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, యాక్సిస్ బ్యాంక్ ఉభయగోదావరి క్లస్టర్ హెడ్ కె.బాలసుబ్రహ్మణ్యం, బ్రాంచ్ మేనేజర్ పి.సత్యసురేష్, క్లస్టర్ సెల్స్ ఛానల్ హెడ్ సురేష్ కుమార్, యూనివర్సిటీ ప్రిన్సిపాల్స్, డీన్స్, ఆయా విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఉపకులపతి ఉవాచ

**జాతీయ యువజనోత్సవం**



"లెండి! మేల్కొనండి! మీ గమ్యాన్ని చేరుకునే వరకూ ఆగకండి" అని వివేకానందస్వామి పలికిన ఉత్తేజకరమైన మాటలు యువత మనసుల్లో నిత్యం మెదులుతూ ఉండాలి. విజయాన్ని సాధించి తీరాలి. నిరాశ చెందకూడదు. మీ శక్తి నీరుగారకూడదు. మీ లక్ష్యాన్ని సాధించడానికి కావలసిన శక్తి మీలోనే ఉంది. మీరు ఏది కావాలనుకుంటే దానిని సాధించగలరు. మేలుకొని పైకి లేవండి.సాధించాలని సంకల్పించండి.సంకల్పించటానికి నడుము కట్టండి.పరిపూర్ణత్వాన్ని సాధించండని వివేకానంద స్వామి చెప్పిన ఉత్తేజపూరితమైన మాటల్ని ఎల్లప్పుడూ మీరు గుర్తుంచుకోవాలని, లేచి నిలబడి ధైర్యంగా బలంగా ఉండాలని, బాధ్యతల్ని భుజాల మీద వేసుకుని మీకు మీరే గొప్పవారు కావాలని జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా విద్యార్థి లోకానికి శుభాకాంక్షల్ని అందజేస్తున్నాను.

మొక్కా జగన్నాథరావు

# నన్నయ అధ్యాపకులకు వీసీ అభినందనలు

**06.01.22 (మీడియాసెల్)** వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లండన్ నుండి పార్టిసిపేషన్ సర్టిఫికెట్టును సాధించిన ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఫిజిక్స్ అధ్యాపకురాలు డా.శీలం రాజ్యలక్ష్మీ, తెలుగు విభాగాధ్యాపకులు డా.టి.సత్యనారాయణలను వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అభినందించారు.గురువారం ఈసీ హాల్ లో జరిగిన ఈ కార్యక్రమంలో వీసీ వివరాలను తెలియజేసారు. వివిధ భాష రచనలతో రూపొందించిన ఒకే పుస్తకంగా "1111 పోయమ్స్ 1111 పోయట్స్" అనే పుస్తకానికి వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లండన్ గుర్తింపు లభించింది. "1111 పోయమ్స్ 1111 పోయట్స్" పుస్తకంలో కవన గోదావరి ఛాప్టర్ లో తెలుగు, ఇంగ్లీషు రచనలకు ఎడిటర్స్ గా ఫిజిక్స్ అధ్యాపకురాలు డా.శీలం రాజ్యలక్ష్మీ, తెలుగు విభాగాధ్యాపకులు డా.టి.సత్యనారాయణకు గుర్తింపు లభించిందన్నారు. కవన గోదావరి ఛార్టర్ లో కవితలు వ్రాసిన ఫిజిక్స్ విద్యార్థి పి.భవాని, తెలుగు విద్యార్థులు ఎం.మౌనిక, జి.రోస్లీశ్రీ లకు ప్రచురణ ప్రశంసా పత్రాలు లభించాయన్నారు. సమాజంలో జరిగిన, జరుగుతున్న అనేక విషయాలపై వివిధ కోణాల్లో కవితా వస్తువుగా స్వీకరించి స్పందించిన కవితలు కవన గోదావరిలో కనువిందు చేస్తూ ఆలోచింప



అధ్యాపకులను అభినందిస్తున్న వీసీ జగన్నాథరావు

చేస్తున్నాయన్నారు. తల్లి తండ్రుల ప్రేమ, వారి త్యాగాలు, వారి ఆవేదన,సమాజంలో జరుగుతున్న దాడులు, దాష్టీకాలపైన, రైతన్నల ఆర్తనాదాల పైన, స్త్రీల సమస్యల పైన, జనారణ్యంలో జన ఘోషపైన, గిరిజన సంస్కృతిపైన, మానవీయ విలువలపైన, మాతృభాష పరిరక్షణ వంటి అన్ని అంశాలు దీనిలో ఉన్నాయన్నారు. అధ్యాపకులు, విద్యార్థులు రచనలపై, ప్రచురణలపై దృష్టి సారించాలని వీసీ తెలియజేసి అధ్యాపకులను, విద్యార్థులను అభినందించి సర్టిఫికెట్లను అందించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ప్రిన్సిపాల్స్ ఆచార్య ఎస్.టేకి, డా.కె.రమణేశ్వరి, డా.వి.పెర్సిస్, డా.కె.సుబ్బారావు, ఉమెన్స్ సెల్ కోఆర్డినేటర్ డా.కె.నూకరత్నం, డీన్స్ తదితరులు పాల్గొన్నారు.

## దేశం తొలి మహిళ ఉపాధ్యాయురాలు సావిత్రిబాయిపూలే

### రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్



**03.01.22 (మీడియాసెల్)** సంఘ సంస్కర్త, దేశ తొలి మహిళా ఉపాధ్యాయులు సావిత్రిబాయి పూలే అని, అందరూ ఆమెను స్ఫూర్తిగా తీసుకుని విద్యా రంగంలో రాణించాలని రిజిస్ట్రార్ ఆచార్య తుపాకుల అశోక్ అన్నారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీలో సోమవారం సావిత్రి బాయి పూలే 191 వ జయంతిని పురస్కరించుకుని జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ మాట్లాడుతూ స్వాతంత్ర్య సంగ్రామానికి ముందు మహిళల విద్యాహక్కు కోసం పోరాడిన వీర వనితగా సావిత్రీబాయి పూలే అని కొనియాడారు. ఆమెను ఆదర్శంగా తీసుకొని ప్రతి మహిళ సమాజాభివృద్ధికి, కుటుంబ అభివృద్ధికి పాటుపడాలన్నారు. ఆమె మొదటి మహిళా ఉపాధ్యాయురాలిగా సేవలందించారని, ఆమె ఆలోచనలను, ఆశయాలను అందరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ ఆచార్య ఎస్.టేకి, డా.కె.సుబ్బారావు, డీన్ డా.పి. వెంకటేశ్వరరావు, డా.ఎం.గోపాలకృష్ణ,మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## డిగ్రీ 4వ, పీజీ 2వ సెమిస్టర్స్ ఫలితాలను విడుదల



పరీక్ష ఫలితాలు విడుదల చేస్తున్న వీసీ

**08.01.22 (మీడియాసెల్)** ఉభయగోదావరి జిల్లాల్లోని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం డిగ్రీ 4వ సెమిస్టర్, పీజీ 2వ సెమిస్టర్ పరీక్షా ఫలితాలను వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు విడుదల చేశారు. శనివారం వీసీ కార్యాలయంలో ఆయన ఫలితాలు విడుదల చేసి వివరాలను తెలియజేశారు. డిగ్రీ 4వ సెమిస్టర్, పీజీ 2వ సెమిస్టర్ రెగ్యులర్ విద్యార్థుల పరీక్షా ఫలితాలను విడుదల చేసామని అన్నారు. ఉభయగోదావరి జిల్లాల్లోని డిగ్రీ 4వ సెమిస్టర్ బిఏ, బికామ్, బిబిఏ, బిఎస్సీ, బిసిఏ, ఒకేషనల్ కోర్సులకు సంబంధించి మొత్తం 28337 మంది విద్యార్థులు పరీక్షలు వ్రాసారని, వారిలో 17103 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని చెప్పారు. ఉత్తీర్ణతా శాతం 60.36 గా ఉందని తెలిపారు. అలాగే పీజీ 2వ సెమిస్టర్ పరీక్షలు 3326 మంది విద్యార్థులు వ్రాసారని 2231 మంది ఉత్తీర్ణత సాధించారని ఉత్తీర్ణత శాతం 68.08గా ఉందన్నారు. ఫలితాల వివరాలను యూనివర్సిటీ వెబ్సైట్ www.aknu.edu.in ద్వారా పొందవచ్చునని అన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, డీన్ ఎగ్జామినేషన్ డా.ఎ.మట్టారెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఎస్.లింగారెడ్డి, సిస్టమ్ మేనేజర్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఎం. ఎస్. ఎన్ క్యాంపస్



**03.01.22 (మీడియాసెల్)** కాకినాడ అచ్చంపేట జంక్షన్ లో గల ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఎం.ఎస్.ఎన్ క్యాంపస్ నందు శ్రీమతి సావిత్రి బాయి పూలే గారి 191వ జయంతిని పురస్కరించుకుని జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా క్యాంపస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. కమల కుమారి మాట్లాడుతూ స్వాతంత్ర్య సంగ్రామానికి ముందు మహిళల విద్యాహక్కుకై ఆ రోజుల్లో పోరాడిన వీర వనితగా పేర్కొన్నారు. ఆమెను ఆదర్శంగా తీసుకొని ప్రతి మహిళ సమాజాభివృద్ధికి, కుటుంబ అభివృద్ధికి ఉపయోగపడాలని పేర్కొన్నారు. ఆమెను మొదటి మహిళా ఉపాధ్యాయురాలిగా అందరూ ఇప్పటికీ గుర్తు చేసుకుంటూ ఉన్నామంటే ఆమె కృషి చాలా గొప్పదని అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో లో డా. ఎం. పోచయ్య, విజయశ్రీ ,నాని బాబు, బీవీఎస్ స్వామి, డా.శ్రీరామరాజు, డా.అజయ్ రతన్, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.




కాకినాడ ఎం.ఎస్.ఎన్ క్యాంపస్‌లో విద్యార్థులు సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. ప్రిన్సిపాల్ డా.ఎం.కమలకుమారి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు



తాడేపల్లిగూడెం క్యాంపస్ లో విద్యార్థులు సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీ రమేష్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సమ్యక్ క్రాంతి.. సంక్రాంతి



'సం' అనే ఉపసర్గా 'కాంతి' అనే పదం కలసి ఏర్పడినదే సంక్రాంతి. క్రాంతి, సంక్రమణం పర్యాయపదాలు. ఒక స్థానాన్నుండి మరొక స్థానానికి వెళ్ళటం. ఒకటి మరొకటితో కలవటం. సూర్యుడు మకర రాశిలోనికి ప్రవేశించటం మకర సంక్రాంతి. భూమి సూర్యుని చుట్టూ ప్రదక్షిణ చేస్తుంది ఇది ఒక సౌర సంవత్సరం. చంద్రుడు భూమి చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ ఉంటాడు ఈ కాలం ఒక చాంద్రమాసం. సౌరమానంలో మకర సంక్రాంతి నుంచి ఉత్తరాయణం ప్రారంభమవుతుంది. మకర సంక్రాంతి నాటికి రైతులు ఇంటికి కొత్త ధాన్యం వస్తుంది. అందుకనే పులగం వండుతారు.

మల్లికాసుల వారనబడే మల్లికార్జున భక్తులు భ్రమరాంబ మల్లికార్జునులను పెట్టెలలో ఉంచి స్టాండ్ వంటి అరపలపై పెట్టుకొని జంగములు గంటలు మ్రోగిస్తూ శైవ గీతాల్ని గానంచేస్తూ మేలుకొలుపులు పాడుతారు. బుడబుక్కలవారు అంబ పలుకు జగదంబ పలుకు అంటూ అమ్మవారిని కీర్తిస్తూ సంచరిస్తారు. వీరందరినీ శివ భక్తులు, శాక్తేయులు గా గమనించాలి. యాచకులుగా భావించకూడదనేది సమాజ ధర్మం.

ముఖ్యంగా రైతులకు సంబంధించిన పండుగ సంక్రాంతి. పశువులు, పంటల పండుగ, పెద్దల పండుగ కలిస్తే పెద్ద పండుగ. మంచుతెరలు,చలిమంటలు, గంగిరెద్దులు, కొత్త ధాన్యం, కొత్త బట్టలు, హరిదాసులు, గొబ్బెమ్మలు, భోగిపళ్ళు, ముగ్గులు, బొమ్మల కొలువులు... ఇవన్నీ కలసి సంక్రాంతి మన కళ్ళముందు సాక్షాత్కరిస్తుంది. ఒక నెల వ్యవధిలో సమాజం క్రిస్మస్ పండుగ లోంచి, ఆంగ్ల నూతన సంవత్సరంలోకి,ధనుర్మాసంలోంచి సంక్రాంతికి....ఇలా అన్ని వర్గాల వారు పండుగ వాతావరణంలో హుషారుగా ఉంటూ కనిపిస్తారు. ఇదే చైతన్యానికి ప్రతీక. ఇదే సంక్రమణం. ఒక కొత్త కాంతి.

పంట పొలాల్లో శ్రమించిన రైతుల కష్టానికి తగిన ఫలితంగా ధాన్యం దిగుబడులు పంట కల్లాలలో కళకళలాడుతుంటే రైతుల ముఖాల్లో ఒక కాంతి తలుక్కున మెరుస్తుంది. అదే ఆ వెలుగు పేరే సంక్రాంతి.

సంక్రాంతి ప్రధానంగా మూడు రోజుల పండుగ. మొదటి రోజు భోగి. రెండవ రోజు సంక్రాంతి. మూడవ రోజు కనుమ. ధనుర్మాస వ్రతాన్ని ఆచరించి గోదాదేవి శ్రీరంగనాధుని పెళ్లి చేసుకుని సకల భోగాలను అందుకున్నది ఈ రోజు కాబట్టి సంక్రాంతి రోజున భోగి పండుగ చేసుకుంటారు.



పంట పొలాల్లో వర్షాకాలంలో పడిపోయిన చెట్లను, కొమ్మలను, పాత సామగ్రిని, పురుగు పుచ్చడానికి ఆస్కారమున్న రద్దును ఒక్క చోటికి చేర్చి తగులబెట్టడం భోగి మంటలు.

తమకున్న సంపదలో కొంత దానధర్మాలకు ఉపయోగించటం పండుగల పరమార్థం. అది ఏ పండుగైనా, ఏ మత ధర్మానికైనా ఇది వర్తిస్తుంది. మనిషి ఎప్పుడూ గతంలోకి తొంగి చూస్తూనే ఉంటాడు. వర్తమానాన్ని అందంగా మల్చుకోవటంకోసం గతంలోనికి ఒక సారి తొంగి చూడటం చరిత్ర. వెనుకటి తరాల పండుగ వేడుకలను, ఆచారాలను, సంప్రదాయాలను పునర్నిర్మించి ఆనందించాలనే ప్రతి మనిషి అనుకుంటాడు.



మనిషి ప్రకృతిలో కేవలం చిన్న భాగం మాత్రమే. కొండకోనల్లో పక్షులతో, నదులతో, జంతువులతో కలసి జీవించిన మనిషి మేధస్సు విజృంభించి ఆకాశాన్ని భూగోళాన్ని దాటి విస్తరించిన విధానం పుస్తకాల్లో గమనించాం. మనిషి చాలా ఎదిగాడు. ప్రకృతికి దూరమయ్యే అంతగా!!

జలపాతాన్ని, పురివిప్పిన నెమలిని, అందంతో కనిపించే ఇంద్రధనుస్సు ను చూసి ఆనందించే స్థితిని కోల్పోతున్న డెమో మనిషి. మన పండుగలు, పరమార్థాలు, ఆధ్యాత్మిక విషయాలు,మత ధర్మాలు, సంస్కృతి మనిషిని ప్రకృతికి దగ్గరగా,ప్రశాంతంగా, నిర్మలంగా, నిజాయితీగా జీవించడం కోసం ప్రయత్నం చేస్తూనే ఉంటాయి. ఒక్కసారి ప్రకృతిలోకి వెళ్ళమనే మనకు సంక్రాంతి ఇస్తున్న సందేశం!!

– ఎడిటర్

ప్రచురణ : మీడియా సెల్, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం-రాజమహేంద్రవరం, ఈమెయిల్ :- nannayavani@aknu.edu.in